ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# రాజన్న ఆలయ ఉద్యోగికి పదోన్నతి

**ప్రజానావ, వేములవాడ:**

దక్షిణ కాశీగా పేరుగాంచిన, ప్రముఖ ప్రసిద్ధ శైవక్షేత్రమైన వేములవాడశ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న నీలి సుశీల్ కుమార్ కు జూనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి కల్పిస్తూ రాజన్న ఆలయ కార్యనిర్వహణాధికారి కె. వినోద్ రెడ్డి శుక్రవారం పదోన్నతి ఉత్తర్వుల కాపీ అందజేశారు. ఈ సందర్భంగా సుశీల్ సహచర ఉద్యోగులు,శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థత

**ప్రజానావ, గంగాధర:**

గంగాధర మండలం బూరుగుపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 20 మంది విద్యార్థులకు అస్వస్థత. కడుపునొప్పి, వాంతులు చేసుకున్న విద్యార్థులు. కొత్త బియ్యం కావడంతో అన్నం సరిగా ఉడక లేదని, బియ్యం ప్రాబ్లం తోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పాఠశాలలోని విద్యార్థులకు చికిత్స అందజేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదు.

# ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్య


**ప్రజానావ, కోనరావుపేట:**

మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన అలువాల వెంకటేశ్ (16) అనే విద్యార్థి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన అలువాల శ్రీనివాస్ అంజవ్వల చిన్న కుమారుడు వెంకటేశ్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. కొడుకు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





# టీబీ ఛాంపియన్స్ శిక్షణ కార్యక్రమం




**ప్రజానావ, తిమ్మాపూర్ :**

క్షయ నివారణ విభాగం, టీటీ అలర్ట్ ఇండియా ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ వారి సహకారంతో తిమ్మాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు జిల్లా టీబీ అధికార మార్గదర్శంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు డా. ప్రణవ్ మాట్లాడుతూ క్షయ వ్యాధిని జయించిన వారిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వీరంతా శిక్షణలో నేర్చుకున్న విషయాలను గ్రామ పంచాయతఈ మీటింగులలో, స్కూళ్లలో, మహిళా సంఘాల మీటింగ్‌లలో వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమానికి తిమ్మాపూర్ ఎంపీడీఓ విజయ్ కుమార్, ఎంపీవో సురేందర్, క్షయ నివారణ విభాగం టీబి కోఆర్డినేటర్ అశోక్, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్ హాజరు కాగా, తిమ్మాపూర్ పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ వెంకటేశ్వరి, స్వరూప రాణి, టీడీ అలెర్ట్ ఇండియా కమ్యూనిటీ కోర్డినేటర్స్ పారిజాతం, తిరుపతి, రాజబోస్, రాజేందర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

**ప్రజానావ, గంభీరావుపేట:**

ప్రజానావ, గంభీరావుపేట: మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జై తెలంగాణ మాల మహానాడు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం పిలుపునిచ్చారు. శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఆత్మగౌరవ సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో మాల, మాల ఉపకులాలు అన్ని రంగాల్లో వెనకడ్డాయని, 40 ఏళ్లుగా ప్రభుత్వం నుంచి ఏ ఒక్క సంక్షేమ పథకం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల నుంచి విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడ్డామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ, ఆర్థిక, రాజకీయంగా అన్ని రంగాల్లో మాలలు, మాల అనుబంధ కులాలకు అన్యాయం జరిగిందన్నారు. దళిత బంధు, మూడెకరాల భూమి ప్రభుత్వ పథకాల్లో ప్రభుత్వం మాలలకు మొండి చేయి చూపిందన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో లహరి ఫంక్షన్ హాల్‌లో జరిగే మాల మాల ఉపకులాల ఆత్మగౌరవ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి దోసల ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శి నల్ల రాజ్ కుమార్, మండల అధ్యక్షుడు లక్కం బాబు, జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు, గంభీరావుపేట పట్టణ అధ్యక్షుడు జంగ రాకేశ్, బండ నవీన్, గాదం శంకర్, పెండల బాలయ్య, తోడేటి సుదర్శన్, దోసల రామచంద్రం, నాందేడ్ మనోజ్ కుమార్, జక్కుల రాజు, బంటు శంకర్, మద్దెల బాలరాజు, నల్ల శ్రీధర్, దోసల శంకర్, దుబాసి శివరాజం తదితరులు పాల్గొన్నారు.





# కళాకారుల ప్రజాపాలన కళా యాత్ర

**ప్రజానావ, వేములవాడ:**

ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై కళాకారులు శుక్రవారం ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, యువతకు 56వేల ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు కల్పించన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని వివరించారు.

గృహజ్యోతి కింద పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్, ఆరోగ్య శ్రీ కార్డు రూ. 5లక్షల నుంచి రూ.10లక్షలు పెంచారని పేర్కొన్నారు. రైతులకు ఏకకాలంలో రూ .2లక్షల రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం టీం లీడర్ ఎడమల శ్రీధర్ రెడ్డి, కళాకారులు పొత్తూరి రాజు, శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, వంతడుపుల గణేశ్, గుగ్గిళ్ల పరుశరాములు, పూడూరు సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, అంతడుపుల లావణ్య, కిన్నెర శ్రీలత, అనుముల శిరీష, ఆయా గ్రామాల ప్రజలు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వాగేశ్వరి కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

**ప్రజానావ, తిమ్మాపూర్ :**

తిమ్మాపూర్ మండలంలో గల వాగేశ్వరీ ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు శుక్రవారం రోజు ప్రారంభించారు. ఇందులో భాగంగా చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల వైద్యురాలు డాక్టర్ దివ్యరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్ పై అవగాహన కల్పించారు. అలాగే ముఖ్యంగా స్త్రీలలో యూరినరీ ట్రాక్ సంబంధించిన వ్యాదుల గురించి తగు జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేశారు. మధ్యాహ్నం విద్యార్థులు విజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 20 రకాల మోడల్స్ నీ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు మొదటి, ద్వితీయ బహుమతులకు ఎంపిక చేశారు. మొత్తం పోటీల్లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్. రామకృష్ణ, విభాగాధిపతి రాజ్ కుమార్, నవీన్ కుమార్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# కష్ట కాలంలో పార్టీని నమ్ముకున్న వారికే పదవులను కట్టబెట్టిన ఆది

**ప్రజానావ, వేములవాడ :**

కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న వారికే పదవులను కట్టబెట్టి కార్యకర్తలు నాయకుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపారు స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్. శుక్రవారం వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ గా నాగయ్య పల్లి గ్రామానికి చెందిన రొండి రాజు, వైస్ చైర్మన్ గా కనికరపు రాకేష్ ను నియమించారు. 12 మంది సభ్యులతో మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఏర్పాటు చేశారు. ఇందులో రాగిరి రాజు, ఖమ్మం గణేష్, పాలకుర్తి పరశరాములు, వస్తాది కృష్ణ ప్రసాద్, మానుపాటి పరశురాములు, షేక్ సబీర్, మ్యాక స్రవంతి, కత్తి కనకయ్య, చెరుకు శంకరయ్య, గుర్రం విద్యాసాగర్, ధైత కుమార్, చీకోటి నాగరాజు లను నియమించారు. దీంతో నూతన పాలకవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.





# శ్రీ చైతన్య కళాశాలలో ఉచిత వైద్య శిబిరం







**ప్రజానావ, తిమ్మాపూర్ :**

ప్రజానావ, తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని కళాశాల చైర్మన్ రమేశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో ఉచిత హైపొర్ టెన్షన్, డయాబెటీస్, ఒబేసిటీ, ఎనీమియా నిర్ధారణ పరీక్షలతో పాటు వీటిపై అవగాహన కల్పించారు. ఈ క్యాంప్ లో 100మంది విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 63వ జాతీయ ఫార్మసీ ఉత్సవాల కొనసాగింపుగా ఫార్మా క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, ఓరల్ ప్రజెంటేషన్, రంగోలి, ఫైన్ ఆర్ట్స్, పోటీలను కళాశాల చైర్మన్ ఎం. రమేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల అంశాల పైన ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకోవడంతో పాటు నూతన పరిశోధన అంశాలు, నైపుణ్యాలపై మరింత అవగాహన పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామనరసింహారెడ్డి , ప్రొఫెసర్ అప్పారావు (హెచ్‌వోడీ), మీడియా ఇన్‌చార్జి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అదరగొట్టిన బౌలర్లు



- పెర్త్‌లో సత్తాచాటిన పేసర్లు
- తొలి రోజే 17 వికెట్లు
- భారత్ 150 ఆలౌట్, ఆస్ట్రేలియా 67/7
- బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మొదటి టెస్టు తొలిరోజు

**పెర్త్:** బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ ఆరంభ మ్యాచ్ తొలి రోజు బౌలర్లు అదరగొట్టారు. పెర్త్ వేదికగా ఇరు జట్ల మధ్య శుక్రవారం ప్రారంభమైన మొదటి టెస్టు తొలి రోజే ఏకంగా 17 వికెట్లు నేలకూలాయి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకే కుప్పకూలింది. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 67 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. తొలి రోజు ఆటలో ఇరు జట్ల బౌలర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. తొలుత భారత్, తర్వాత ఆస్ట్రేలియా బౌలర్లు అసాధారణ బౌలింగ్‌తో చెలరేగి పోయారు. దీంతో మొదటి రికార్డు స్థాయిలో 17 వికెట్లు పడిపోయాడు.

### ఆరంభంలోనే ఝలక్..

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు ఆరంభంలోనే షాక్ తగిలింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. స్టార్క్ అద్భుత బంతితో జైస్వాల్‌ను వెనక్కి పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన దేవ్‌దుత్ పడిక్కల్ కూడా నిరాశ పరిచాడు. హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో పడిక్కల్ సున్నాకే ఔటయ్యాడు. దీంతో భారత్ 12 పరుగుల వద్ద రెండో వికెట్‌ను కోల్పోయింది. ఇక జట్టును ఆదుకుంటారని భావించిన సీనియర్లు విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్‌లు కూడా నిరాశ పరిచారు. కోహ్లి తన పేలవమైన ఫామ్‌ను కొనసాగిస్తూ 5 పరుగులకే పెవిలియన్ చేరుకున్నాడు. ఆ వెంటనే కెఎల్ రాహుల్ కూడా ఇంటిదారి పట్టాడు. రాహుల్ 74 బంతుల్లో 3 ఫోర్లతో 26 పరుగులు చేసి స్టార్క్ చేతిలో వెనుదిరిగాడు. మరోవైపు యువ ఆటగాడు ధ్రువ్ జురేల్ కూడా విఫలమయ్యాడు. 2 ఫోర్లతో 11 పరుగులు మాత్రమే చేసి మార్ష్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే వాషింగ్టన్ సుందర్ కూడా వెనుదిరిగాడు. సుందర్ 4 పరుగులు మాత్రమే చేశాడు. ఈ వికెట్ కూడా మార్ష్ పడగొట్టాడు.

### పంత్, నితీశ్ పోరాటం..

ఈ దశలో వికెట్ కీపర్ రిషబ్ పంత్, ఆరంగేట్రం మ్యాచ్ ఆడుతున్న తెలుగుతేజం నితీశ్ రెడ్డి కొద్ది సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు.

ఇద్దరు సమన్వయంతో ఆడుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. ఈ జోడీని విడగొట్టేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చాలా సేపు వేచి చూడాల్సి వచ్చింది. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా సమన్వయంతో ఆడుతూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచేందుకు ప్రయత్నించారు. కానీ 78 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 37 పరుగులు చేసిన పంత్‌ను ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ వెనక్కి పంపాడు. పంత్ ఔటైనా నితీశ్ జోరును కొనసాగించాడు. 59 బంతుల్లో ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 41 పరుగులు చేసి కమిన్స్ బౌలింగ్‌లో చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. హర్షిత్ రాణా )7), కెప్టెన్ బుమ్రా (8) పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో హాజిల్‌వుడ్ నాలుగు, స్టార్క్, కమిన్స్, మార్ష్ తలో రెండేసి వికెట్లను పడగొట్టారు.

### బుమ్రా జోరు..

భారత్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశామనే ఆనందంతో తొలి ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య ఆస్ట్రేలియాకు భారత కెప్టెన్ జస్‌ప్రిత్ బుమ్రా చుక్కలు చూపించాడు. ఓపెనర్లు నాథన్ మెక్ స్విని (10), ఉస్మాన్ ఖ్వాజా (8)లను బుమ్రా ఔట్ చేశాడు. అంతేగాక స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌ను కూడా బుమ్రా వెనక్కి పంపాడు. స్మిత్ ఖాతా తెరవకుండానే ఇంటిదారి పట్టాడు. జట్టును ఆదుకుంటాడని భావించిన లబుషేర్ (2), ట్రావిస్ హెడ్ (11), మిచెల్ మార్ష్ (6) కూడా నిరాశ పరిచారు. కెప్టెన్ పాట్ కమిన్స్ (3) కూడా విఫలమయ్యాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ కీపర్ అలెక్స్ కారీ (3), మిచెల్ స్టార్క్ (6) క్రీజులో ఉన్నారు. భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరును చేరుకోవాలంటే ఆస్ట్రేలియా మరో 83 పరుగులు చేయాలి. ఇక టీమిండియా బౌలర్లలో బుమ్రా నాలుగు, సిరాజ్ రెండు, హర్షిత్ ఒక వికెట్ పడగొట్టారు.

### తీరు మారని కోహ్లి

టీమిండియా సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి పేలవమైన ఫామ్ ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులోనూ కొనసాగింది. శుక్రవారం ప్రారంభమైన బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో కోహ్లి తేలిపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లి ఐదు పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. అంతకుముందు న్యూజిలాండ్‌తో సొంత గడ్డపై జరిగిన సిరీస్‌లోనూ కోహ్లి ఘోర వైఫల్యం చవిచూశాడు. తాజాగా ఆసీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించాడు. ఈసారి కూడా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో మాత్రమే కోహ్లి మెరుగైన బ్యాటింగ్‌ను కనబరిచాడు. కివీస్‌పై అతను 70 పరుగులు చేశాడు. అయితే తొలి ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఆ తర్వాత జరిగిన రెండు టెస్టుల్లో పూర్తిగా నిరాశ పరిచాడు. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఒక పరుగు మాత్రమే చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 17 పరుగులకే ఔటయ్యాడు. మూడో టెస్టులోనూ విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 పరుగులు మాత్రమే చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ తేలిపోయాడు. ఈసారి ఒక పరుగు మాత్రమే చేసి ఇంటిదారి పట్టాడు. ఇలా చివరి ఏడు ఇన్నింగ్స్‌లలో కోహ్లి ఒక్కసారి మాత్రమే అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. కోహ్లి కొంతకాలంగా వరుస వైఫల్యాలు చవిచూస్తున్నాడు. కివీస్ సిరీస్‌లో అతని వైఫల్యం జట్టుకు శాపంగా మారింది.

## చైనా మాస్టర్స్.. సెమీ ఫైనల్లో అడుగుపెట్టిన సాత్విక్‌చిరాగ్ జోడీ

చైనా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అదరగొడుతున్నారు. ఈ ద్వయం శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌లో 2116, 2119తో కిమ్ ఆస్ట్రప్, అండర్స్ స్కారప్ రాస్ముస్సేన్ (డెన్మార్క్) జంటపై విజయం సాధించింది. వరల్డ్ నంబర్ 2 అయిన డెన్మార్క్ జోడీని భారత జంట 47 నిమిషాల్లోనే చిత్తు చేసింది. మొదటి గేమ్‌లో విరామ సమయానికి 118తో నిలిచిన సాత్విక్ చిరాగ్ జోడీ.. ఆధిక్యాన్ని 1610కి పెంచుకుంది. తర్వాత కూడా అదే జోరు కొనసాగించి గేమ్‌ని చేజిక్కించుకుంది. రెండో గేమ్ మాత్రం హోరాహోరీగా సాగింది. ఒక దశలో స్కోరు 88తో ఉండగా.. విరామ సమయానిక భారత జోడీ 1110 ఆధిక్యాన్ని సాధించింది. తర్వాత కూడా ప్రత్యర్థి జంట నుంచి ప్రతిఘటన ఎదురైనా భారత ద్వయం చివర వరకు పట్టు సడలించకుండా గేమ్‌ను సొంతం చేసుకుని మ్యాచ్‌ను ముగించింది.



## 'మిస్టర్ 360' రిషభ్ పంత్.. కమిన్స్ బౌలింగ్‌లో అదిరే సిక్స్!

**పెర్త్:** బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా, భారత జట్ల మధ్య మొదటి టెస్టు జరుగుతోంది. రిషభ్ పంత్ మరోసారి తన వైవిధ్యమైన షాట్లను ప్రదర్శించాడు. ఫాస్ట్ బౌలర్ కమిన్స్ వేసిన బంతిని ఫైన్‌లెగ్ దిశగా కొట్టిన విధానం అద్భుతమనే చెప్పాలి. రిషభ్ పంత్ (360 డిగ్రీల కోణంలో స్వీప్ చేస్తున్నట్లుగా బౌండరీ లైన్‌ను బంతిని దాటించాడు. భారత ఇన్నింగ్స్‌లో అదే తొలి సిక్స్ కావడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 150 పరుగులకు ఆలౌటైంది. నితీశ్‌రెడ్డి (41)తోపాటు రిషభ్ పంత్ (37), కేఎల్ రాహుల్ (26) మాత్రమే రాణించారు.

**ఏ ఫ్రాంచైజీకి వెళ్తున్నావు? రిషభ్ పంత్‌తో నాథన్ లైయన్**

స్పిన్నర్ నాథన్ లైయన్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు పంత్ నితీశ్ బౌండరీలను బాదారు. ఆ జోడీ లయను దెబ్బ తీసేందుకు లైయన్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో పంత్, లైయన్ మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఇది స్టంప్స్ మైక్‌లో రికార్డు కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇదంతా ఐపీఎల్ మెగా వేలం గురించి కావడం గమనార్హం. దిల్లీ క్యాపిటల్స్ పంత్‌ను రిటైన్ చేసుకోకపోవడంతో అతడు మెగా వేలంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. దానిని ప్రస్తావిస్తూ.. 'ఆక్షన్‌లో ఎవరికి వెళ్తావని అనుకుంటున్నావు?' అని లైయన్ అడిగాడు. అందుకు స్పందిస్తూ.. 'నాకేమీ తెలియదు' అని బదులిచ్చాడు. వచ్చే ఆది, సోమవారాల్లో సౌదీ అరేబియా రాజధాని జెడ్డా వేదికగా ఐపీఎల్ మెగా వేలం జరగనుంది.



